# ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దు


వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

- మోసపోయి గోసపడొద్దు
- కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 7: బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలకు ప్రజలు మోసపోయి గోసపడొద్దని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. మంగళవారం పద్మనాయక మినీ కల్యాణమండపంలో వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి గంగుల హాజరై మాట్లాడారు. కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను, నాలుగో సారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, వడ్డెర సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వడ్డెరులు

# అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

- మొగ్దుంపూర్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన సీపీ
- నగరంలో పలు చోట్ల నాఖాబందీ
- నెంబర్ ప్లేట్, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు సీజ్


వాహన తనిఖీలను పర్యవేక్షిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

రాంనగర్, నవంబర్ 7: ఎన్నికలు సమీపిస్తున్నందున కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. సోమవారం రాత్రి నగరంలోని వన్, త్రీ టౌన్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పలు చోట్ల నాఖాబందీ నిర్వహించారు. వన్‌టౌన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలతో పాటు నెంబర్ ప్లేట్ కూడా లేని 14 వాహనాలను సీజ్ చేశామన్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాఖా చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహించగా, సరైన నెంబర్ ప్లేట్, ధ్రువీకరణ పత్రాలు లేని 9 వాహనాలను సీజ్ చేయగా, వాటిలో 7 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు ఉన్నాయని చెప్పారు. అలాగే తనిఖీల్లో అనుమానాస్పద వ్యక్తులను సైతం గుర్తించి, విచారించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో ఈ ఆకస్మిక తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామన్నారు. రాత్రి సమయంలో సరైన కారణం లేకుండా అనవసరంగా తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల నిర్వహణను స్వయంగా పర్యవేక్షించిన అనంతరం మొగ్దుంపూర్‌లో ఏర్పాటు చేసిన అంతర జిల్లా చెక్ పోస్ట్‌ను సీపీ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందిని వాహన తనిఖీల గురించి అడిగి, సంబంధిత రిజిస్టర్‌ను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ వాహనాలతోపాటు, పేషెంట్ లేని అంబులెన్సులు, అన్ని పోలీస్ విభాగాల వాహనాలను సైతం క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ గోపతి నరేందర్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, శ్రీనివాస్, ఎస్ఐలు స్వామి, ట్రాఫిక్ ఎస్ఐలు నీలవేణి రాజు, రాసమళ్ల సాగర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చొప్పదండిలో బీఆర్ఎస్‌దే విజయం

- కాంగ్రెస్ అభ్యర్థి రాజకీయం వదిలి ఉద్యోగం చేసుకోవాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి
- గంగాధర మండలం కురిక్యాలలో ఎన్నికల ప్రచారం


జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, నవంబర్ 7: చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ భారీ మెజార్టీతో గెలుస్తారని పార్టీ రాష్ట్ర నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కురిక్యాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేచినేని నవీన్‌రావు ఆధ్వర్యంలో యువకులు, గ్రామస్తులు జైపాల్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి, గజమాలతో సన్మానించారు. కాగా, గ్రామానికి చెందిన పలువురు యువకులు సర్పంచ్ నవీన్‌రావు ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జైపాల్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, స్థానికుడైన సుంకె రవిశంకర్‌కు ఇక్కడి సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉండడంతో పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. రెండు సార్లు ఓటమి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి ఈసారి గెలవకపోతే ఆత్మహత్యే శరణ్యమని సానుభూతితో ఓట్లు పొందడానికి ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని, రాజకీయాలను వదిలి ఉద్యోగం చేసుకోవాలని హితవు పలికారు. చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం ఖాయమైందన్నారు. ఇక్కడ కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల లావణ్య-అంజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతు ప్రకటిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

# అభివృద్ధికే పట్టం కట్టండి

- బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- వివిధ కులసంఘాల ఆత్మీయ సమ్మేళనానికి హాజరు

చొప్పదండి,నవంబర్ 7: ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లలో అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిపామని, ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని పార్టీ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజలను కోరారు. మంగళవారం చొప్పదండిలో లారీ అసోసియేషన్, తాపీ మేస్త్రీ సంఘం, విశ్వబ్రాహ్మణసంఘం, హెల్ప్‌నీడ్, వివేకానంద యువజనసంఘం, నాయీబ్రాహ్మణసంఘం, మాలసంఘం, ప్లంబర్ యూనియన్, పేయింటర్ యూనియన్, ఎలక్ట్రిషన్ అండ్ వైండింగ్ వర్క్స్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం వేర్వేరుగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి సుంకె రవిశంకర్ హాజరై మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో అభివృద్ధిలో వెనుకబడిన చొప్పదండి నియోజకవర్గాన్ని తాను ఎమ్మెల్యేగా గెలిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రూ.కోట్లాది నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయించానన్నారు. నియోజకవర్గంలో స్థానికుడైన తనను మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటూ సేవకుడిగా పనిచేస్తానన్నారు. కులసంఘాలు, యువజన సంఘాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమ్మేళనానికి వచ్చిన సుంకె రవిశంకర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో కులసంఘాల సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సీవిజిల్ యాప్‌పై విస్తృత ప్రచారం చేయాలి


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఈవో, సీపీ

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

కలెక్టరేట్, నవంబర్ 7 : అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు వినియోగిస్తున్న సీవిజిల్ యాప్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నామినేషన్ ప్రక్రియ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్యను బట్టి ఈవీఎం యంత్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, అవసరమైతే అదనపు బ్యాలెట్ యూనిట్లు జిల్లాకు అందిస్తామని స్పష్టం చేశారు. నామినేషన్ల ముగిసిన వెంటనే ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి నోడల్ అధికారులతో మాట్లాడుతూ, గతంలో పోలింగ్ తక్కువగా నమోదైన కేంద్రాలపై దృష్టిసారించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది విధిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చూడాలన్నారు. జిల్లాలో మోడల్ పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని, వాటికి మామిడితోరణాలు, పూల వంటి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో సీపీ అభిషేక్ మహంతి, డీఆర్వో పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు అవగాహన కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఈవో పమేలా సత్పతి, ఇతర అధికారులు

కలెక్టరేట్, నవంబర్ 7: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ రూపొందించిన అవగాహన కరపత్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునేందుకకు సంబంధిత బూత్‌స్థాయి అధికారులను గానీ, వెబ్‌సైట్ voters.eci.gov.inలో గాని పరిశీలించాలని సూచించారు. కాగా, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాల్లో ఎన్నికల తేదీ, 1950 టోల్ ఫ్రీ నంబర్, సీవిజిల్ యాప్‌తో కూడిన సమాచారం అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో సీపీ అభిషేక్ మహంతి, డీఆర్వో పవన్‌కుమార్, స్వీప్ నోడల్ అధికారి రవీందర్, డీఆర్డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నవీన్‌కుమార్, ప్రొహిబీషన్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస రావు, సీపీవో కొమురయ్య, మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.